# ఇంటింటా తిరుగుతూ.. ఓటు అభ్యర్థిస్తూ



నుస్తులాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- ముమ్మరంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రచారం

తిమ్మాపూర్, నవంబర్18: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం చేస్తూ ఓటు అభ్యర్థించారు. ఈవీఎంలో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నుస్తులాపూర్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, సర్పంచ్ రావుల రమేశ్, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మళ్లీ గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, నుస్తులాపూర్‌లో ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, అజ్జు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**ఆముదాలపల్లిలో..**

శంకరపట్నం, నవంబర్ 18: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను గెలిపిస్తే ఎల్లవేళలా అండగా ఉంటారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆముదాలపల్లి, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను తిరిగి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రజల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌తోనే గ్రామాలు అభివృద్ధి అవుతాయని ఓటర్లకు చెప్పారు. ఆయనను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. 30న జరిగే ఎన్నికల్లో 'కారు' గుర్తుకు ఓటును వేసి రసమయిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆముదాలపల్లి సర్పంచ్ బత్తుల మానస, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 18: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ బొల్లం రమేశ్ హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా శనివారం మండలంలోని జూపాక, కనుకులగిద్ద, కందుగుల గ్రామాల్లో టౌన్ సీఐ బొల్ల రమేశ్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గతంలో ఎన్నికల సమయంలో జరిగిన ఘటనల ఆధారంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. శాంతి భద్రతలు, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగే అవకాశం ఉన్న పలు గ్రామాల్లో వీధి సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు పాత నేరస్తులను ఇప్పటికే బైండోవర్ చేశామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా చూడడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ యాక్షన్ టీంలు, స్థానిక పోలీసులు తదితరులు ఉన్నారు.



కందుగుల గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

# జోరుగా వరికోతలు

- గ్రామాల్లో వేగంగా ధాన్యం కొనుగోళ్లు
- పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం
- వెంటవెంటనే రైతులకు డబ్బులు అందేలా చర్యలు



రామకృష్ణకాలనీలో వరి కోసి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న హార్వెస్టర్

తిమ్మాపూర్, నవంబర్ 18: వానకాలం వరికోతలు మండల వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు ప్రభుత్వానికే అమ్ముకుంటున్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే అధికారులతో కొనుగోళ్లు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయగా.. రైతులు ధాన్యాన్ని ఆనందంగా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తున్నారు.

తిమ్మాపూర్ మండలంలో వానకాలం 22వేల ఎకరాల్లో వరి సాగు కాగా.. ఇందులో 4ఎకరాలు సన్నరకాన్ని రైతులు సాగు చేశారు. ప్రస్తుతం మండలంలో సగానికి పైగా కోతలు పూర్తయ్యాయి. అలాగే మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. నుస్తులాపూర్ సొసైటీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కేంద్రాలన్నింటినీ పౌరసరఫరాల శాఖ, మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**పెరిగిన మద్దతు**

రైతుల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వం ఈ సంవత్సరం మద్దతు ధరను పెంచింది. ఏ గ్రేడ్ వడ్లకు క్వింటాలుకు రూ.2,203, బీ గ్రేడ్ వడ్లకు క్వింటాలుకు రూ.2183 చొప్పున చెల్లిస్తున్నది. ఇటు రైతు బంధు ఇస్తూ, ప్రతి సంవత్సరం ధాన్యం మద్దతు ధరను పెంచుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిత్యం పర్యవేక్షణ**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిత్యం ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. తగినంత తేమ వచ్చిన వెంటనే తూకం వేయిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తూకం వేసిన వెంటనే రైతుకు డబ్బులు అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అర్చనాప్రియదర్శిని

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మానకొండూర్ రూరల్, నవంబర్ 18: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా పోటీల్లో పాల్గొని, ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అర్చనాప్రియదర్శిని తెలిపారు. ఈ నెల 20 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ –14 నుంచి ఇ. హన్సిక, వై అక్షయ, డి.అన్విత, అండర్ –17 నుంచి జి.మనోజ్ఞ, సీహెచ్. హర్షిత, కె.మణిదీప్ పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్‌తో పాటు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, కోచ్ కుమార్, పాఠశాల పీఈటీ పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## కరీంనగర్ డెయిరీలో పశువైద్య శిబిరం

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 18: మండలంలోని రామకృష్ణకాలనీలో గల కరీంనగర్ డెయిరీ ఆవరణలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు చూడి పరీక్షలు చేశారు. అలాగే గర్భకోశ వ్యాధులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో డెయిరీ అధ్యక్షుడు సిరికొండ వెంకటరావు, కార్యదర్శి సంపత్, డైరెక్టర్లు, రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోన్ అప్పగించిన పోలీసులు

తిమ్మాపూర్, నవంబర్ 18: ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి అందజేశారు. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండికి చెందిన ముమ్మాడి హిమాలయ అనే వ్యక్తి ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి హిమాలయకు శనివారం అప్పగించారు. తన ఫోన్ తిరిగి అప్పగించిన ఎల్ఎండీ పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఫోన్ అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీవాణి

# 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఎస్ఐ పట్టుకున్న రేషన్ బియ్యం

ఇల్లంతకుంట, నవంబర్ 18 : మండల కేంద్రంలోని బోయినపల్లి రోడ్డుపై పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేస్తుండగా 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న వానరాసి శ్రీనివాస్ అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. 100 సంచులతో ఉన్న ఆటో సీజ్ చేసి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు. రేషన్ బియ్యం తరలించడం నేరమని, ఎక్కడైనా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మద్యం పట్టివేత

తిమ్మాపూర్ రూరల్, నవంబర్18: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పరిమితికి మించి మద్యం తరలిస్తున్న ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేసి, మద్యం సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా, జక్కుల ఓదెలు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై 45మద్యం సీసాలను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. మద్యం, వాహనం సీజ్ చేయడంతో పాటు ఓదెలుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు శ్రీకాంత్, సరిత, సిబ్బంది రాజేశం, సురేశ్, నరేశ్, కొండల్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.